క్లుప్తంగా

ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పలు ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సోమవారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని, ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు ముగియడంతో ఈ తోఫాను కోటలో ఎమ్మెల్యే అందజేశారు.

పద సంచాలన్ ర్యాలీ



ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

బొబ్బిలి: పట్టణ వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) పద సంచాలన్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవర్ జయంతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పురవీధుల్లో తిరిగారు.

దుప్పట్ల పంపిణీ

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో ఉన్న పేదలకు దుప్పట్లు, దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. ఉగాది పండగ సందర్భంగా రాజాంకు చెందిన రిటైర్డ్ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్వీ రమణారావు వాటిని 70 మందికి అందజేశారు.

ఉత్తమ సేవలకు ఉగాది పురస్కారం

బాడంగి: బొబ్బిలిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన పలువురికి పాతబొబ్బిలికి చెందిన స్వచ్ఛంద సంస్థ వారు ఆదివారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. బాడంగి మండలంలోని కోడూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, భారత, భాగవత ప్రవచనకారుడు, కళాకారుడు కలిగట్ల బాబూరావు కూడా ఆ పురస్కారం పొందారు. దివ్యాంగులైనప్పటికీ వైద్యసేవలతో పాటు ప్రవచనాలు చెప్పడంలోనూ నాటకాలు వేయడంలోనూ తనదైన ప్రతిభ కనబరుస్తూ ఆకట్టుకుంటున్నారని వక్తలు బాబూరావును ప్రశంసించారు.

కొప్పరవలసలో నిత్యాన్నదానం



మాట్లాడుతున్న సాదెం వెంకటరమణ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో తిరుపతి నవజీవన్ ట్రస్ట్‌కు చెందిన ఆచార్య కె.శ్రీధర్ ఆర్థికసాయంతో నిత్యాన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. అమృత కలశం పేరిట ప్రతిరోజూ నిత్యాన్నదానం చేపట్టి కొప్పరవలస, మద్దివలస, కె.కొత్తవలస గ్రామాల్లోని దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలకు క్యారేజీల ద్వారా భోజనం అందివ్వనున్నామని ట్రస్ట్ చీఫ్ మేనేజర్ సాదెం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సీతారాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తలగాంలో ఏరువాక



దుక్కి పనులు ప్రారంభిస్తున్న వైద్యులు ప్రసాద్ తదితరులు

వంగర: ఉగాది పురస్కరించుకుని, మండలంలోని తలగాం గ్రామంలో ఏరువాక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అంతకు ముందు అమృతశ్రీ బయో సీఎన్‌జీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా అధునాతన వ్యవసాయోత్పత్తులు సాగు చేస్తామని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రైతులకు ఉపాధి కల్పిస్తామని వైద్యుడు గార రవిప్రసాద్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పరిశ్రమలు వస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం జోడెద్దులకు కట్టిన నాగలితో దుక్కి పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, సర్పంచ్‌లు సంకిలి సురేష్, యలకల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కొరగంజి సాయిరాం ఆదివారం ప్రారంభించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల తాగునీటి సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు, బాటసారులు, వాహన చోదకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇది ఏ ఊరు?

- కానరాని రోడ్ల పక్క గ్రామాల నేమ్‌బోర్డులు
- కొన్నిచోట్ల చెరిగిపోయి.. మరికొన్నిచోట్ల అస్పష్టంగా..
- ఇంకొన్నిచోట్ల డొంకల్లో కనీకనిపించనట్టుగా బోర్డులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



పూర్తిగా ధ్వంసమైన సంతకవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం నేమ్‌బోర్డు

రాజాం: ఇది ఫలానా గ్రామం.. ఇంకొంచెం దూరం వెళ్తే ఫలాన ఊరు వస్తుందని తెలిపే నేమ్‌బోర్డులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. రోడ్ల పక్క ఊర్ల పేర్లు తెలిపే బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడో ఓ చోట ఉన్నా ఆ బోర్డుపై ఉన్న ఊరి పేరు అంత స్పష్టంగా ఉండడం లేదు. కొన్నిచోట్ల బోర్డుల మీద ఉండాల్సిన పేర్లు పూర్తిగా చెరిగిపోతే.. మరికొన్నిచోట్ల పేరులోని ఏదో అక్షరం లేకుండా పూర్తిగా ఊరి పేరే మారేలా ఉంటున్నాయి. ఇంకొన్నిచోట్ల ముళ్లపొదలు, డొంకలు, చెట్లకొమ్మల చాటున బోర్డులు దర్శనమిస్తున్నాయి. వాటి దగ్గరకు వెళ్తే గానీ అక్కడో బోర్డు ఉందని తెలియడం లేదు. దీనివల్ల ప్రయాణికులు, కొత్తగా ఆ రోడ్డులో ప్రయాణం చేసే వారు ఊరి పేర్లు తెలియక.. ఎంత దూరం వెళ్తే ఏ ఊరు వస్తాదన్న విషయాలు తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేసవిలో మరమ్మతులు చేయాలి..

ఏటా వేసవిలో రోడ్ల పక్కన పాడైన నేమ్‌బోర్డుల మరమ్మతులు చేపట్టాలి. అవసరమైనచోట కొత్త వాటిని ఏర్పాటు చేయాలి. ప్రధాన రహదారి కూడళ్లలో ఈ బోర్డులదే ప్రధాన పాత్ర. గ్రామాల ఆరంభం, శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డులేవీ ఇప్పుడు లేవు. గతేడాది వరకు ఉన్న వీటి నిర్వహణ ఇప్పుడు లేదు. ఒక్కో గ్రామం వద్ద ఈ బోర్డుల ఏర్పాటుకు రూ.1200లు వరకు ఖర్చు చేస్తారు. ఏటా వీటి నిర్వహణతో పాటు కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరవుతాయి. ఈ లెక్కన ఈ ఏడాది బోర్డుల కోసం కేటాయించిన నిధులు ఏమైనట్లు అని అందరూ ప్రశ్నిస్తున్నారు.



వంగర రోడ్డులోని కోడిశ గ్రామ నేమ్‌బోర్డు ఇలా..

బోర్డు లేక దారి తప్పుతున్నారు..

రాజాం నియోజకవర్గం నుంచి అటు వంగర, ఇటు సంతకవిటి, మరోవైపు రేగిడి తదితర మండలాలకు వెళ్లే ప్రధాన రహదారులు ఉన్నాయి. వంగరలో ప్రధాన రహదారి అనుకుని ఒకటో రెండు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లోని కూడళ్ల వద్ద నేమ్‌బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఒక గ్రామానికి వెళ్లాల్సిన వారు ఇంకో గ్రామానికి వెళ్తున్నారు. కొంతమంది ఏ గ్రామం ఏదో కొంతసేపు అటు ఇటూ తిరగాల్సిన దుస్థితి. సంతకవిటి, రేగిడి మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. సంతకవిటి మండలం, రంగారాయపురం ప్రధాన రహదారికి చాలా దూరంగా ఉంది. ఇక్కడి కూడలిలో కూడా ప్రయాణికులను దిశానిర్దేశం చేసేలా నేమ్‌బోర్డు లేదు.



ముళ్లపొదల్లో రాజాం మండలంలోని రాజీవ్‌పేట వద్ద నేమ్‌బోర్డు

బోర్డులపై తీగలు అల్లేస్తున్నాయి..

గతేడాది వేసవితో పాటు ఈ ఏడాది వేసవిలో కూడా రోడ్డుకు ఇరువైపులా చేపట్టాల్సిన జంగిల్ క్లియరెన్స్ పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు చేయలేదు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న ఊరి పేర్లు తెలిపే బోర్డులపై డొంకలు, తుప్పలు, తీగలు అల్లేసి అవి కనిపించకుండా పోతున్నాయి. బోర్డు మొత్తం కొన్ని కలుపుమొక్కల తీగలు పూర్తిగా అల్లేయడంతో వాటిపై పేర్లు ఉన్నట్టే కాదు.. అక్కడ బోర్డు ఉన్నట్టు కూడా దగ్గరకు వెళ్తే తప్ప కానరావడం లేదు.

పాడైన బోర్డులు బాగుచేస్తాం..

గ్రామాల దగ్గర రోడ్లకు ఆనుకుని ఉన్న ఊరి నేమ్‌బోర్డులు బాగుండేలా చూస్తాం. పాడైన వాటిని బాగు చేయించి, ప్రదర్శిస్తాం. అన్ని ఊరి పేర్ల బోర్డులు సరిగా ఉండేలా చర్యలు చేపడతాం. తుప్పు పట్టి ధ్వంసమైన వాటి చోట కొత్త బోర్డులు పెడతాం.

–డీవీ ప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, రాజాం



కనీకనిపించనట్టుగా రేగిడి మండలంలోని కాగితాపల్లి నేమ్‌బోర్డు



తీగమొక్కలతో నిండిన రేగిడి మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద బోర్డు



జంగిల్స్ కారణంగా స్పష్టంగా కనిపించని ఖండ్యాం-తాటిపాడు గ్రామాల కూడలి వద్ద నేమ్‌బోర్డు

క్యాలెండర్ ఆవిష్కరణ

రాజాం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ బొద్దాం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రూపొందించిన తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. పట్టణ సీఐ అశోక్‌కుమార్ చేతులమీదుగా క్యాలెండర్ విడుదల చేసి, పలువురికి అందజేశారు. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన తెలుగు కాలసూచికలోని ఎన్నో భగవద్గీత వచనాలను ఈ క్యాలెండర్‌లో జోడించి ఇవ్వడం జరిగిందన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఇంగ్లిష్ తేదీలను కూడా పొందుపరిచినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రామినాయుడు, రామకృష్ణ, సూరపునాయుడు, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ అశోక్‌కుమార్

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా చిన్నయ్య

బాడంగి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా మండలంలోని రేజేరు గ్రామానికి చెందిన రాజాన చిన్నయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. తనకు ఈ పదవి రావడంలో కృషి చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడులకు కృతజ్ఞతలని, అంతకంటే ముందు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఆయన అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

వాడవాడలా ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. భక్తులు ఆలయాలకు చేరుకుని, విశేష పూజలు చేశారు. పూజారులు, పండితులు చేసిన పంచాంగ పఠనం శ్రద్ధగా విని, కొత్త ఏడాది ఎలా ఉండబోతుందో తెలుసుకున్నారు. అనంతరం షడ్రుచుల ఉగాది పచ్చడి రుచి చూశారు. తెలుగు నూతన సంవత్సరాది పురస్కరించుకుని రైతులు ఏరువాక కార్యక్రమం చేపట్టారు. వేకువజామునే నాగలి, పలుగు, పార చేతబట్టి పొలానికి చేరుకుని, దుక్కి పనులు ఆరంభించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: రాజాం మల్లిఖార్జునకాలనీలోని గాయత్రి ధ్యాన మందిరంలో శ్రద్ధగా పంచాంగం వింటున్న భక్తులు



రాజాం: పెనుబాకలో ఉగాది పూజలు చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు



వంగర: కె.కొత్తవలసలో నాగలికి పూజలు చేస్తున్న రైతులు



రేగిడిలో పంచాంగ శ్రవణం



బాడంగి: భీమవరంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రామశాస్త్రి



తెర్లాం: జగన్నాథవలస రామాలయంలో ఉగాది పూజల్లో భక్తులు



బొబ్బిలిరూరల్: రాచ్చేరువలసలో పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ నిర్వాహకులు



సంతకవిటి: మందరాడలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



రాజాం సిటీ: రాజాం తెలగవీధి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉగాది వేడుకల్లో చిన్నారుల కోలాటం



రామభద్రపురం షిర్డీసాయిబాబా ఆలయంలో ఉగాది పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు



రామభద్రపురం: ఉగాది వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన చిన్నారులు

ఓ వైపు ఎండ.. మరోవైపు మంచు!



బాడంగిలో భిన్న వాతావరణం నెలకుంటోంది. ఓ వైపు ఎండ.. మరోవైపు మంచు ప్రజలకు సరికొత్త అనుభూతిని అందిస్తున్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో మండల కేంద్రంలో దట్టంగా మంచు కురిసింది. ఉదయం 10 గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగి, 11 గంటల తర్వాత మండే ఎండలు కాశాయి. ఈ రెండు రకాల వాతావరణాలను చూసి ఇదేం.. విచిత్రం.. అని జనం అనుకుంటున్నారు.

–బాడంగి

ఆకులకట్ట-పినపెంకి రోడ్డుకు మోక్షమెప్పుడో?



బాడంగి మండలంలోని ఆకులకట్ట-పినపెంకి రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలు, తేలినరాళ్లతో ఉండడంతో అటువైపుగా వెళ్లే వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. గతంలో పారాది వంతెన మరమ్మతులకు గురవ్వడంతో ఇదే రోడ్డు మీదుగా బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ ప్రాంతాలకు భారీ లోడులతో వాహనాలు రాకపోకలు సాగించేవి. దీంతో అప్పటివరకు కాస్త బాగున్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో ఈ దారిలో కొత్త రోడ్డుకు మోక్షమెప్పుడో అని కొందరు.. తారురోడ్డు నిర్మించాలని మరికొందరు ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేస్తున్నారు.

–బాడంగి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి



పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని దళిత సంఘ నాయకులు పెంకి భీమయ్య, పెంకి జార్జ్ ఎబినైజర్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు పలువురితో కలిసి రామభద్రపురం మండలం, ఆరికతోటలో కొవ్వొత్తుల ర్యాలీ ఆదివారం చేపట్టారు. దైవ సేవకుడు ప్రవీణ్‌కుమార్ మరణం వెనక ఎన్నో అనుమానాలు ఉన్నాయని, ఆయనది సహజ మరణం కాదని.. ముమ్మాటికీ ఆయనది హత్యేనని ఆరోపించారు. త్వరితగతిన పోస్టుమార్టం రిపోర్టు తెప్పించి, నిందితులను పట్టుకుని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.చంద్రవేఖర్, పి. చంద్రశేఖర్, పి.రవి, పి.బాబ్జి, ఎస్‌ఐ సురేష్‌కుమార్, పి.సుధాకర్, ఆర్.అప్పారావు, కె.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

–రామభద్రపురం

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం



నినాదాలు చేస్తున్న మతవిశ్వాసులు

బొబ్బిలి: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతికి సంతాపంగా స్థానిక పట్టణంలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దైవ సేవకుడు ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆయన మృతి చాలా బాధాకరమని, ఆయన మరణం వెనక ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయనది హత్యా.. మరణమా అనేది త్వరగా తేల్చి నిందితులను పట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయకుమార్ శర్మ, అశోక్, బాబూరావు, జాషువాకుమార్, శివ మాస్టర్, మోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగాన్ని గాలికొదిలేశారు..



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: సాగునీటి రంగాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో రబీ సాగుకు సాగునీరు అందించే ప్రాజెక్టులు లేకపోవడం విచారకరమన్నారు. ప్రధాన సాగునీటి కాలువలన్నీ ప్రస్తుతం తుప్పలు, డొంకలతో నిండిపోయాయని, సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. పిల్లకాలువలు అయితే మరీ దారుణంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పక్కన పెట్టేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సంక్షేమంపై శ్రద్ధ వహించాలని, సాగునీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు.

మోక్షప్రదాయిని భగవద్గీత

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీత చదివిన ప్రతిఒక్కరూ మోక్షం పొందుతారని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు.

మండలంలోని దేవుదళ గీతా మందిరంలో గొర్లె దామోదరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రతిఒక్కరం క్షణం తీరిక లేకుండా జీవితం గడుపుతున్నామని, రోజులో ఎంతో కొంత సమయం దైవకార్యక్రమంలో పాల్గొనాలన్నారు. భగవద్గీత పఠిస్తే చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తాగునీటి కుళాయిల ప్రారంభం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలోని ప్రధాన వీధి సహా గొల్లవీధిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి కుళాయిలను సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఆదివారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన రూ.3.5 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

వంగర: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోని మరమ్మతులకు గురైన తాగునీటి బోరును ఆదివారం బాగుచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. మెకానిక్‌లు కళింగ కృపారావు, రామకృష్ణ, వెంకటరమణలు బోరు మరమ్మతులు చేపట్టారు.